ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 18 మార్చి 2024



చిల్లకూరు మండలం బల్లవోలు సమీపంలో టిప్పర్‌కి లోడు చేస్తున్న సిలికా



కోట సిద్ధవరం వద్ద అసైన్డ్ భూముల్లో ఉన్న సిలికా



తేనేటివాగు వద్ద సిలికా నిల్వలు

వైసీపీ సిలికాసురులు

ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోని రూ.కోట్ల ఖనిజ సంపద కొల్లగొడుతున్నారు

సముద్ర తీర మండలాల్లో విస్తారంగా ఉన్న సిలికాపై వైసీపీ నేతలు కన్నేశారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ అనధికారికంగా తవ్వేస్తూ కోట్ల రూపాయల ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు. రాయల్టీ, సీనరేజ్ చార్జీలు చెల్లించకుండా ప్రభుత్వానికీ పంగనామం పెడుతున్నారు. - కోట

కోట, చిల్లకూరు మండలాల్లో విస్తారంగా సిలికా ఖనిజ నిల్వలు ఉన్నాయి. ఈ రెండు మండలాల్లో అధికారికంగా 77 సిలికా మైన్‌లు ఉన్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు రంగ ప్రవేశం చేశారు. ఇంకేఅన్ని మైన్‌లన్నీ తమ గుప్పెట్లోకి తీసుకొన్నారు. చిల్లకూరు మండలంలోని చింతవరం, మోమిడి, వరగలి, బల్లవోలు, వేళ్లపాళెంలతోపాటు కోట మండలం సిద్ధవరం కర్లపూడి, గోవిందపల్లి, కొత్తపట్నం, శ్రీనివాసాసత్రం గ్రామాల్లో అధికారిక మైన్‌లున్నాయి. వీటిల్లో నిల్వలు అయిపోవడంతో పక్కన ఉన్న ప్రభుత్వ, పేదల ఆధీనంలోని అసైన్డ్ భూములపై కన్నేశారు.

ఎకరా అసైన్డ్‌భూమికి రూ.2-3 లక్షలిస్తున్నారు

ఎకరా అసైన్డ్ భూమిలోని సిలికా తవ్వుకోవడానికి పేదలకు రూ.2-రూ.3 లక్షలు ఇస్తున్నారు. కొందరు అంగీకరించకుంటే బెదిరించి మరీ భూములను లాక్కొంటున్నారు.

అనుమతులు ఓ చోట.. తవ్వకాలు మరోచోట

అనుమతులు ఒకచోట ఉంటే.. తవ్వకాలు మరోచోట జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. రాత్రింబవళ్లు యథేచ్ఛగా సిలికాను తవ్వేసి, బయటి రాష్ట్రాలకు అడ్డదారుల్లో తరలిస్తూ.. కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు.

తేనేటివాగు టార్గెట్ : కోట మండలం సిద్ధవరం పంచాయతీలో సర్వే నెంబరు 39-20లలో ఉన్న 280 ఎకరాల విస్తీర్ణంలో సిలికా నిల్వలున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ భూములే. ఈ భూములున్న ప్రాంతం తేనేటివాగుగా రెవెన్యూ రికార్డులో ఉంది. వీటిల్లో 150 ఎకరాలు ఏపీఐఐసీ తీసుకోగా.. మిగతావి సిద్ధవరం దళితుల ఆధీనంలో ఉన్నాయి. వీటికి పట్టాలున్నాయి. ఈ మొత్తం భూములపై వైసీపీ నేతలు కన్నేసి, సిలికాను తవ్వేస్తున్నారు. అలాగే ఇదే మండలంలోని గోవిందపల్లి, సిద్ధవరం గ్రామాల సరిహద్దుల్లో సర్వేనెంబరు 628లో సుమారు 120 ఎకరాలు ఏపీఐఐసీకి చెందిన భూములున్నాయి. ఈ భూముల్లోనూ సిలికా నిల్వలు ఉండటంతో రాత్రిపూట వందలాది టిప్పర్లతో ఖనిజాన్ని తోడేస్తున్నారు. వీటితోపాటు కోట, చిల్లకూరు మండలాల్లో దేవదాయశాఖకు చెందిన సుమారు 50 ఎకరాల్లోనూ ఖనిజాన్ని తవ్వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం

టన్ను సిలికాకు రాయల్టీ పేరుతో ప్రభుత్వానికి రూ.350 చెల్లించాల్సి ఉంది. సీనరైజ్ చార్జీలు లక్షల్లో ఉంటాయి. ఈ రెండూ కోట్ల రూపాయల్లోనే ప్రభుత్వానికి చెల్లించాలి. దీంతో ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతోంది.

నిఘా పెడతాం

సిలికా అక్రమ తవ్వకాలపై నిఘా పెడతాం. రెవెన్యూ అధికారుల సహకారమూ తీసుకుంటాం. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- రంగకుమార్, మైనింగ్ ఏడీ

ఇంకా సర్దుకోని అసంతృప్తులు

● అసమ్మతి, విభేదాలతో ప్రధాన పార్టీలు సతమతం

తిరుపతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక కూడా జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఇంకా అసంతృప్తులు సర్దుకోలేదు. ప్రధాన రాజకీయ పార్టీలు అసమ్మతి, వర్గ విభేదాలు, అలకలతో సతమతమవుతున్నాయి.

తిరుపతికి జనసేన పరిశీలకుడి రాక

తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు పార్టీ శ్రేణులు సహకరించడంపై చర్చించేందుకు పరిశీలకుడిగా అజయ్‌కుమార్‌ను అధిష్ఠానం పంపింది. ఆదివారం ఆయన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్, ముఖ్యనేత రాజారెడ్డితో భేటీ అయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచీ పనిచేయడంతో పాటు పోలీసు కేసుల సహా వేధింపులు ఎదుర్కొన్నానని, కుటుంబాన్నీ కష్టాల్లోకి నెట్టానని కిరణ్ రాయల్ వాపోయారు. తనకు టికెట్ ఇవ్వకపోయినా ఫర్వాలేదని, స్థానికులకు ఇవ్వాలని కోరారు. తన రాజకీయ భవిష్యత్తుపై పవన్ స్పష్టమైన హామీ ఇస్తే అభ్యర్థి గెలుపునకు పని చేస్తానన్నారు. రాజారెడ్డి కూడా పార్టీ అధినేత చెబితేనే తాము ఎన్నికల్లో పనిచేస్తామన్నారు. కాగా, ఒకరిద్దరు నేతలు, శ్రేణులతో కలిసి జనసేన అభ్యర్థి శ్రీనివాసులు ప్రచారం చేశారు.

సర్దుకోని సత్యవేడు

సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం విషయంలో ఆ పార్టీ శ్రేణులు ఇంకా సర్దుబాటు కాలేదు. ఆయనకు వ్యతిరేక కేవీబీపురం, నాగలాపురంలో కొందరు శ్రేణులు నిరసన చేపట్టారు. మాజీ ఎ హేమలత లేదా డాక్టర్ హెలెన్‌లో ఒకరికి అవకాశం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు.

శ్రీకాళహస్తిలో ఇంకా అందని మిత్రపక్షాల సహకారం

శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డికి మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నుంచీ ఇంకా సహకారం అందలేదు. తనకు టికెట్ రాలేదని టీడీపీ నేతలు హేళన చేస్తూ తన ఇంటి ఎదుట టపాసులు కాల్చారని జనసేన ఇన్‌చార్జి వినుత ఆరోపించారు. సుధీర్‌రెడ్డి ఇంతవరకూ తనను కలవలేదని, ఫోన్ కూడా చేయలేదన్నారు. పవన్‌కల్యాణ్‌తో మాట్లాడాక భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. బీజేపీ శ్రేణులూ సహకరించడం లేదు. అయితే టికెట్ ప్రకటించి మూడు రోజులే కావడం, ఈలోపు చిలకలూరిపేటలో కూటమి సభకు వెళ్లే ఏర్పాట్లలో సుధీర్‌రెడ్డి బిజీగా ఉన్నందున జనసేన, బీజేపీ నేతలను కలవలేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఒకట్రెండు కలిసి.. సహకారం కోరనున్నారన్నారు.

వెంకటగిరిలో రెండు శిబిరాల్లోనూ కలకలం

వెంకటగిరిలో వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని వ్యతిరేకిస్తున్న వర్గానికి నేతృత్వం వహిస్తున్న మెట్టుపల్లి ధనుంజయరెడ్డి ఆదివారం రాపూరులో అనుచరులతో సమావేశమయ్యారు. వైసీపీ అభ్యర్థిగా తాము వ్యతిరేకించిన వ్యక్తినే ప్రకటించిన నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. త్వరలో ఒక నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించుకోవడంతో వైసీపీలో కలకలం రేగింది.

● కాగా, టీడీపీ టికెట్‌ను బీసీలకు కేటాయించాలని చంద్రబాబును అభ్యర్థిస్తూ బీసీ కులాల ఐక్య వేదిక పేరిట ఆదివారం వేకువ జామున వెంకటగిరిలో ఫ్లెక్సీలు వెలవడం కలకలం రేపింది. ఇక్కడి టికెట్ ఆశించిన బీసీ నేత మస్తాన్ యాదవ్ అనుచరులు లేదా అభిమానులు వీటిని ఏర్పాటు చేసి ఉండొచ్చన్న ప్రచారం జరుగుతోంది.

వేనాటి రామచంద్రారెడ్డితో వైసీపీ నేతల భేటీ?

సూళ్లూరుపేట టీడీపీకి రాజీనామా చేసిన వేనాటి రామచంద్రారెడ్డిని ఆదివారం హైదరాబాదులో వైసీపీకి చెందిన నెల్లూరు డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి కలిసినట్టు తెలిసింది. వైసీపీలో చేరిక గురించి చర్చించినట్టు సమాచారం. రామచంద్రారెడ్డి తనయుడు సుమంత్‌రెడ్డి కూడా తడ మండలంలో పలువురు టీడీపీ వర్గీయులను కలసి తన తండ్రి నిర్ణయానికి మద్దతిచ్చి తమతో నడవాలని కోరుతున్నట్టు తెలిసింది.

తొలగని హోర్డింగులు

తిరుపతిలో...



ఒకటి, రెండ్రోజుల్లో స్పష్టత వస్తుంది
- కలెక్టరేట్ అధికారులు

తిరుచానూరు: ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు యాడ్ ఏజెన్సీలు ఏర్పాటు చేసిన హోర్డింగులు, సైన్ బోర్డులను కూడా తొలగించాల్సిందేనని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. అయితే దీనిపై ఒకటి, రెండ్రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు.

తిరుపతి క్రైం, మార్చి 17: తిరుపతిలోని చాలా ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రానికి కూడా వైసీపీకి చెందిన హోర్డింగులు తొలగించలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కొన్నిచోట్ల మాత్రం శనివారం రాత్రి నుంచే వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగులు, జెండాలు, కటౌట్ల తొలగింపు ప్రారంభమైన విషయం తెలిసిందే.





వంతెన వద్ద ఉన్న సిద్ధం హోర్డింగు - వైఎస్ విగ్రహం వద్ద కనిపిస్తున్న పేరు

రేణిగుంటలో.. పట్టణంలోని వంతెన వద్ద వైసీపీకి చెందిన సిద్ధం హోర్డింగును ఆదివారం కూడా తొలగించలేదు. ప్రధాన కూడలిలో వైఎస్ విగ్రహానికి ముసుగేసినా ఆయన పేరు కనిపిస్తోంది. - రేణిగుంట


బాలాయపల్లిలో..

బాలాయపల్లి: వెలుగు కార్యాలయం వద్ద ఉన్న గేటు గోడలకు వైసీపీ పోస్టర్లు అలాగే ఉన్నాయి. ఆదివారమైనా వీటిని తొలగించలేదు.



పాకాలలో..

పాకాల: పంచాయతీ కార్యాలయం ప్రహరీపై సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆయిల్ పెయింటింగ్స్ అలాగే ఉన్నాయి. ఆదివారం రాత్రికి కూడా వీటిని తొలగించలేదు.



తిరుమలలో పారిశుధ్య కార్మికుల నిరసన

● పీఎన్ఎస్ సంస్థ ఇబ్బంది పెడుతోందని ఆరోపణ



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు సంస్థ అయిన పీఎన్ఎస్‌లో పనిచేసే సుమారు 40 మంది పారిశుధ్య కార్మికులు తిరుమలలో ఆదివారం వేకువజామున నిరసన వ్యక్తం చేశారు. తమను ఇబ్బంది పెడుతోందని ఆరోపిస్తూ.. దానికింద పనిచేసే వీరంతా వైకుంఠం క్యూకాంప్లెక్స్, పద్మావతి ఏరియాలో విధులు బహిష్కరించారు. అనంతరం వైకుంఠం క్యూకాంప్లెక్స్ సమీపంలోని కార్యాలయం ముందు బైఠాయించారు. అత్యవసర సమయంలో లీవ్ తీసుకుంటే విధులను నుంచి తొలగిస్తున్నారని, క్రిస్టియన్ల తరహాలో బొట్టు, పూలు, కాళ్లకు గొలుసులు వేసుకోవద్దంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిని కూడా తగ్గించి పని భారం పెంచేస్తున్నారని, కాసేపు సేద తీరితే ఫొటోలు తీసి.. విధులకు రావద్దని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇదేమని అడిగితే.. 'ఉంటే ఉండు.. లేకపోతే వెళ్లిపో' అంటున్నారని చెప్పారు. విషయం తెలుసుకున్న టీటీడీ హెల్త్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ప్రయోజనం లేకపోవడంతో హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరిస్తామని, విధులకు హాజరుకావాలని కోరారు. దాంతో కార్మికులు విధులకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పీఎన్ఎస్ సంస్థ నిర్వాహకులు తరచూ కార్మికులను వేధిస్తున్నారన్నారు. ఇకనైనా ఈ సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రవాణాశాఖ చెక్‌పోస్టుల మూత

తడ, మార్చి 17: రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో నడిచే చెక్ పోస్టులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం మూసివేసింది. ఇందులో భాగంగా తడ మండలంలోని భీములవారిపాళెం వద్ద ఉన్న చెక్‌పోస్టు కూడా మూతపడింది. ఇక్కడ ఉన్న అధికారులు, సిబ్బందికి ఎన్నికల కోసం ఏర్పాటైన చెక్‌పోస్టుల్లో విధులు కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. అవసరమైతే జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం సదరు సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంటుందని సమాచారం.



తడ మండలంలోని భీములవారిపాళెం రవాణాశాఖ చెక్‌పోస్టు

కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో

బీటెక్ విద్యార్థి దుర్మరణం

● మరో ఇద్దరికి గాయాలు



కారుపై టీటీడీ లోగో, మెంబర్ ఆఫ్ పార్లమెంటు అక్షరాలు

తిరుచానూరు, మార్చి 17: ఓ కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తిరుచానూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి జీవకోన చెందిన సందీప్(21) పుత్తూరులోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం పుత్తూరు నుంచి ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలోని దామినేడు సమీపంలో జాతీయ రహదారిపై వస్తుండగా.. ముందు వెళుతున్న కారు సడన్ బ్రేక్ వేసింది. దీంతో ఈ కారును వెనుక నుంచి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సందీప్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా సడన్ బ్రేక్ వేయడమే ప్రమాదానికి కారణమని సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. దాంతో కారు డ్రైవర్‌ని అరెస్టు చేసి, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించగా, సందీప్ తల్లిదండ్రులు అక్కడికొచ్చి బోరున విలపించారు. మిగిలిన ఇద్దరు కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులు తెలిపారు.

ఇంతకీ ఈ కారెవరిది?

ప్రమాదానికి కారణమైన కారుపై టీటీడీ లోగో, మెంబర్ ఆఫ్ పార్లమెంటు అనే అక్షరాలు ఉండటం గమనార్హం. ఈ కారు ఎవరిదన్న విషయంలో పోలీసులు గోప్యతను పాటిస్తున్నట్లు సమాచారం.



సందీప్ మృతదేహం

శ్రీవారి తెప్పోత్సవాలకు జోరుగా ఏర్పాట్లు



సిద్ధమైన తెప్ప

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలకు ఏర్పాట్లు జోరందుకున్నాయి. ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణిలో ఉత్సవర్లు విహరించే తెప్పను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేశారు. నీటిపై గాలితో కూడిన డ్రమ్ములను ఏర్పాటు చేసి, దానిపై మండపం రూపంలో ఉండే తెప్పను నిర్మించి.. రంగులు అద్దుతున్నారు.

ఏ రోజు ఎలా.. తొలిరోజున సీతా లక్ష్మణ ఆంజనేయ సమేతంగా రామచంద్రమూర్తి తెప్పపై మూడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు. రెండో రోజున రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై మూడుసార్లు విహరిస్తారు. మూడో రోజున శ్రీభూ సమేతంగా మలయప్పస్వామి మూడుసార్లు పుష్కరిణిలో విహరించి, భక్తులను అనుగ్రహిస్తారు. నాల్గవ రోజున ఐదుసార్లు, చివరిరోజు ఏడుసార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు.

గ్రూప్-1 పరీక్షలకు 6,037 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 17: జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 9,377 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 6,037 మంది హాజరయ్యారని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ తెలిపారు. తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 16 కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరిగాయి. ఏఎస్పీ కులశేఖర్, ఇతర పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.



తిరుపతి ఎస్వీ జూనియర్ కాలేజీ వద్ద హాల్‌టికెట్ల పరిశీలన

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో కవాతు



ఐతేపల్లెలో కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

చంద్రగిరి, మార్చి17: మీకు రక్షణగా ఉంటాము.. మీ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి అంటూ చంద్రగిరి మండలంలోని ఐతేపల్లె, ఎ.రంగంపేట, అగరాల, రామిరెడ్డిపల్లెలో ఆదివారం ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కవాతులో ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 24 మంది ఎంపిక



పాకాల, మార్చి 17: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి వైద్య బృందం మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహకారంతో 114 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 24 మందికి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. వీరికి చెన్నై శంకర్ నేత్రాలయలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు, ఉపాధ్యక్షుడు మచ్చా కృష్ణమూర్తినాయుడు, ప్రతినిధులు జి.రామయ్య, జయరామనాయుడు, ఆర్.దొరస్వామి నాయుడు, జివి.ప్రసాద్, జి.దొర, పార్థా పాల్గొన్నారు.

అలరించిన గాత్రకచేరి



తిరుచానూరు, మార్చి 17: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం గాత్రకచేరి ఆహూతులను ఆకట్టుకుంది.. తిరుపతికి చెందిన మన సంస్కృతి కళాసంస్థ కళాకారులు మహిళాభ్యుదయం అవగాహనపై జానపద గేయాలు ఆలపించారు. కళాకారులు రంగని సహదేవనాయుడు, కలకోట రెడ్డెప్ప, దొరస్వామి, లీలావతి, నీలిమ, గీత, హరినాథ్ శ్యాంబోలో, నాగమణి, సుబ్రహ్మణ్యం, మునిరత్నం తదితరులు మహిళాభ్యుదయంపై గీతాలను ఆలపించారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

జనగళం సభకు తరలిన టీడీపీ నాయకులు



రామచంద్రాపురం, మార్చి 17: చిలకలూరిపేటలో జరిగిన జనగళం సభకు ఆర్‌సీపురం మండల టీడీపీ నాయకులు ఆదివారం ఉదయం తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లానాయకులుచిన్నబాబు, హరిప్రసాద్, సురేంద్రనాయుడు, దినేష్‌నాయుడు ఉన్నారు.

తిరుమలలో 5న అన్నమయ్య వర్ధంతి

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్ధంతి కార్యక్రమాన్ని టీటీడీ ఏప్రిల్ ఐదో తేదీన తిరుమలలో నిర్వహించనుంది. ఈసందర్భంగా శ్రీవారి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా బయల్దేరి సాయంత్రం 5.30 గంటలకు నారాయణగిరి ఉద్యానవనాలకు చేరుకుంటారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సప్తగిరి గోష్టిగానం నిర్వహించనున్నారు. తర్వాత స్వామి ఉభయదేవేరులతో కూడి ఆలయానికి వేంచేపు చేస్తారు.

చంద్రగిరిలో టీడీపీదే విజయం: టీఎన్ఎస్ఎఫ్



పులివర్తి నానిని సన్మానిస్తున్న నాయకులు

తిరుచానూరు, మార్చి 17: చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీదే విజయమని టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్‌రాయల్ స్పష్టం చేశారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పులివర్తి నానిని సన్మానించారు. టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు త్యాగరాజు, నాయకులు సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో టీడీపీ ప్రచారం



తిరుపతి(రూరల్), మార్చి17: రానున్న ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానీని గెలిపించాలని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి కోరారు. తుమ్మలగుంట పంచాయతీలో ఆదివారం ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు కేశవులశెట్టి, శ్రీనివాసులు, సిద్దారెడ్డి, చెంగల్రామానాయుడు, పరశురామ్, రాజా, సురేష్, మహేష్, కైలాష్, చిన్నబ్బ, కల్పన, వెంకటమ్మ, జ్యోతి, చిన్నపాప, మస్తాన్, మునీంద్ర, చెంచుశేఖర్, ఉమాపతి, సందీప్, నవీన్, రామ్మోహన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమ్మకండ్రిగలో ఇంటింటి ప్రచారం

రామచంద్రాపురం, మార్చి 17: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని గెలిపించాలంటూ ఆ పార్టీ నాయకులు కమ్మకండ్రిగ, గంగిరెడ్డి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోతో కూడిన కరపత్రాలను పంచిపెట్టారు. నాయకులు జనార్ధన్‌చౌదరి, మధుసూదన్‌రెడ్డి, వెంకటప్రసాద్, అర్జున్‌నాయుడు, వేణు తదితరులున్నారు.



భావితరాల కోసం టీడీపీని ఆదరించండి



పెద్దరామాపురంలో టీడీపీ నాయకుల ప్రచారం

పాకాల, మార్చి 17: భావితరాల భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీని ఆదరించాలని పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి కోరారు. పెద్దరామాపురం పంచాయతీ పరిధిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంచిపెట్టారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎంబీయూలో ఆర్ట్ అండ్ పెయింటింగ్ కోర్సు

● విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ వార్షికోత్సవంలో మంచు విష్ణు వెల్లడి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి, మార్చి 17: భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేందుకు చిత్రకళ ఎంతో అవసరమని, అందుకోసం త్వరలోనే ఎంబీయూలో ఆర్ట్ అండ్ పెయింటింగ్ కోర్సును ప్రారంభించనున్నట్లు విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వర్సిటీ ప్రొఛాన్సలర్ మంచు విష్ణు అన్నారు. ఆదివారం ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ 11వ వార్షికోత్సవాన్ని ఎం.మోహన్‌బాబు, మంచు విష్ణు తదితరులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విష్ణు మాట్లాడుతూ చిత్రకళాకారులు గీసిన ఆర్ట్‌లను ఎంబీయూ లైబ్రరీలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఎంబీయూ చాన్సలర్ ఎం.మోహన్‌బాబు, ఆయన సతీమణి నిర్మల, మంచు విష్ణు సతీమణి విరోనిక, ఎంబీయూ ప్రిన్సిపాల్స్, డీన్లు, అధ్యాపకులు, చిత్రకళాకారులు గురజాల రమేష్(శ్రీకాళహస్తి), హైదరాబాదు నుంచి అంజనిప్రభ, కొల్లి శ్రీహర్ష, భాస్కరరావు బొత్స, లక్ష్మీకిరణ్‌కుమార్, మంగ్రిరిష్ రాజధ్యాక్స్, గాయత్రి దంతూరి, వెంకన్న తీగుల్ల, సురేష్ కృష్ణ, గోవా నుంచి స్వప్నేష్ హరిచంద్ర విష్ణూకర్, నిషంత్‌ధ్యాన్యేర్ డాంగే, జమ్నగర్ నుంచి మనిష్‌కుమార్‌చావ్డా, బెంగళూరు నుంచి మల్లేషి, మోక్షకుమార్, ఉదయపూర్ నుంచి లలిత్‌శర్మ, అహ్మదాబాద్ నుంచి రాకేష్ జయంతి బాయ్‌పటేల్, రోమరాకేష్ పటేల్, సోలంకి వంద్రవాన్ దామోదర్, ఢిల్లీ నుంచి రామ్ ఓంకార్ కనోజై, విమ్మి ఇంద్ర, అమిత్ కొచ్చార్, అసిత్ కుమార్ పట్నాక్, అంజుమ్‌ఖాన్, రూపేష్ ప్రకాష్ రౌత్, జగన్నాథ్ పాయిల్, పూణే నుంచి శ్రీకాంత్ లలసాహెబ్ కదం, డింకర్‌వ విష్ణు జాదవ్, ఉమాకాంత్ నివృట్టి కండే, ఇండోర్ నుంచి వచ్చిన గౌరి వేముల, తదితరులు పాల్గొన్నారు.



చిత్రాలను మంచు విష్ణుకు అందజేస్తున్న కళాకారులు

చిచ్చు రేపిన వివాహ నిశ్చయం

● తండ్రీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, మార్చి 17: వివాహ నిశ్చయం ఓ కుటుంబంలో చిచ్చు రేపింది. తండ్రి, కూతురు మధ్య మాటా మాటా పెరిగి ఇద్దరి ఆత్మహత్యాయత్నానికి దారితీసింది. ఈ ఘటన తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. రామచంద్రపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేవిబిపురం మండలం పెరిందేశం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. రెండు నెలల ఇరు కుటుంబాల పెద్దలు ఆటోడ్రైవర్, కలంకారీ యువతికి వివాహ నిశ్చయం చేసుకున్నారు. పది రోజుల్లో వివాహం ఉండడంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఇంతలో పెళ్లి కుమార్తె తనకు వివాహం ఇష్టం లేదంటూ కుటుంబ సభ్యులకు తెలిపింది. బంధువులందరికీ శుభలేఖలు కూడా పంచేసామని... ఈ సమయంలో పెళ్లి ఆగితే పరువు పోతుందని తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. వివాహ నిశ్చయం రద్దు విషయమై మూడు రోజులుగా తండ్రీ కూతుర్ల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఆదివారం వివాహ ప్రస్తావనతో మళ్లీ ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. దాంతో కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తాను కూడా చనిపోతానంటూ తండ్రి అదే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఇద్దరినీ శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శ్రీకాళహస్తిలో పట్టణ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సాంస్కృతిక కార్యక్రమాల్లో అవినీతిపై విచారణ చేయాలి: సీపీఐ

శ్రీకాళహస్తి, మార్చి 17: ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో జరిగిన అవినీతిపై విచారణ చేయాలని సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'పాపం కళాకారులు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై గురవయ్య స్పందించారు. తాను దశాబ్ద కాలంగా ముక్కంటి ఆలయంలో కళాకారులకు జరుగుతున్న అన్యాయంపై పోరాడుతున్నానన్నారు. ఆలయానికి పెద్ద అధికార యంత్రాంగం ఉండగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రైవేటు వ్యక్తికి ఎందుకు అప్పగిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇకనైనా దేవదాయ శాఖ అధికారులు అవినీతిపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాజీవ్‌నగర్‌లో ఆగని భూకబ్జాలు



రాజీవ్‌నగర్‌లో అక్రమార్కులు తవ్వకాలు చేసిన ఇళ్ల స్థలాలు

శ్రీకాళహస్తి, మార్చి 17: శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో భూకబ్జాదారుల ఆగడాలకు అంతేలేదు. తాజాగా ఆదివారం కొన్ని ఖాళీ ఇళ్ల స్థలాలను కబ్జా చేసేందుకు ఆక్రమణదారులు ప్రయత్నించారు. రాజీవ్‌నగర్‌లోని ఎన్టీఆర్ గృహాల సమీపంలో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలపై కన్నేశారు. వేకువ జామున ఖాళీ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేసేందుకు యంత్రాలతో గుంతలు తీశారు. స్థానికులు అడ్డుకోవడంతో కబ్జాదారులు పనులను నిలిపివేశారు. ఇకనైనా అధికారులు స్పందించి భూకబ్జాలను కట్టడి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాగళం.. ప్రభంజనం



తొడగొడుతున్న యువతి..



పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం



ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్



ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు







ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలుపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట



ఉత్సాహంగా యువతులు..



బాబు, పవన్, పురంధేశ్వరి అభివాదం...



మోదీతో బాబు మాటామంతీ..



జానపదుల నృత్యాలు..



మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..





తిరుపతి

ఎన్నికల కోడ్‌ను పటిష్ఠంగా అమలు చేయాలి



వీడియో కాన్ఫరెన్సులో సీఈవో ముఖేష్‌కుమార్ మీన

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 17 : ఎన్నికల కోడ్‌ను పటిష్ఠంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. కోడ్ అమలుపై ఆయన ఆదివారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో కూడిన పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లను తక్షణమే తొలగించాలని సీఈవో ఆదేశించారు. 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో, 48 గంటల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లో, అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాలన్నారు. సి-విజిల్‌లో అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.


కోడ్ ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయండి

కమిషనర్ అదితి సింగ్



తిరుపతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కోడ్ ఉల్లంఘనలను పాల్పడితే 'సీ విజిల్' యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ అదితి సింగ్ తెలిపారు. యాప్‌లో ఫిర్యాదులు అందిన నిమిషంలోనే స్పందించాలని, ఎన్నికల నియమావళిని అధికారులు, సిబ్బంది పక్కాగా అమలుచేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని తిమ్మినాయుడుపాళెం, జీవకోన, సంజయ్‌గాంధీ కాలనీ, ఆటోనగర్, ఎస్టీవీ నగర్ తదితర ప్రాంతాల్లోని సచివాలయాలను ఆదివారం ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డితో కలసి ఆమె తనిఖీలు నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు విధులు పక్కాగా నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈసీ నిషేధించిన ఫొటోలు, బ్యానర్లు వెంటనే తొలగించి సంబంధిత నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

బీఎస్‌ఎఫ్ దళాల ఫ్లాగ్ మార్చ్



కవాతు నిర్వహిస్తున్న బీఎస్‌ఎఫ్ దళాలు పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 17 : ఓటర్లను చైతన్యం చేయడంలో భాగంగా జిల్లా పోలీస్ యంత్రాంగం బీఎస్‌ఎఫ్ దళాలతో కలిసి కవాతు నిర్వహించింది. ఆదివారం తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెర్లోపల్లి నుంచి పుదిపట్ల వరకు కవాతు నిర్వహించి, ఓటర్లను చైతన్యవంతులు చేశారు. రేణిగుంట డీఎస్పీ భవ్య కిషోర్, డీఎస్పీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వేణుగోపాల్‌పురం ఒడ్డిమిట్ట, పాంచాలి నగర్, గౌరి నగర్, వినాయక నగర్, బుగ్గ వీధి మీదుగా రైల్వే స్టేషన్ వరకు నిర్వహించారు. తడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రైనీ ఐపీఎస్ అధికారి దేవరాజ్ మనీష్ పాటిల్ ఆధ్వర్యంలో కారూరు, కాసింగాడి కుప్పం రామాపురం వెంకటాద్రిపాళెం గ్రామాల్లో ఫ్లాగ్ మార్చి నిర్వహించారు. చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ రామయ్య ఆధ్వర్యంలో ఐతేపల్లి, అగరాల, రామిరెడ్డిపల్లి రంగంపేట గ్రామాల పరిధిలో కవాతు నిర్వహించారు.

టీటీడీ క్రికెట్ పోటీల్లో మస్తాన్ జట్టు విజయం



విజేత మస్తాన్ జట్టు - రన్నరప్ కోదండ జట్టు

తిరుపతి(క్రీడలు), మార్చి 17: టీటీడీ ఉద్యోగుల క్రీడల్లో భాగంగా ఆదివారం జరిగిన టి20 క్రికెట్ పోటీల ఫైనల్స్‌లో మస్తాన్ జట్టు విజయం సాధించింది. కోదండ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుతగా బ్యాటింగ్ చేసిన మస్తాన్ జట్టు 165 పరుగులు చేసింది. ఆ తర్వాత కోదండ జట్టు నిర్ణీత ఓవర్లలో 140 పరుగులు మాత్రమే చేయగలిగింది. ముఖ్య అతిథిగా హాజరైన టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్లకిరణ్ విజేత జట్టుకు రోలింగ్‌ట్రోఫీ, రన్నరప్ జట్టుకు సాధారణ ట్రోఫీని అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.04 కోట్లు

తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.04 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 74,351 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 34,164 మంది తలనీలాలు సమర్పించారు.

శేషాచల అడవుల్లో అనేక చారిత్రక ప్రదేశాలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భూమన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17: శేషాచల అడవుల్లో ఎవ్వరికీ తెలియని అనేక చారిత్రక ప్రదేశాలు ఉన్నాయని శ్వేత డైరెక్టర్ భూమన్ పేర్కొన్నారు. వివేక్ రాసిన లంకమల దారుల్లో పుస్తక పరిచయ సభ ఎస్వీయూ సెనేట్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తరిగొండ వెంగమాంబ రాసిన వేంకటాచల మహత్యంలో తిరుమలలోని అనేక ప్రదేశాల గురించి వివరించారని తెలిపారు. రాయలసీమలోని శేషాచలం, లంకమల, నల్లమల అటవీ ప్రాంతాల్లో మనం చూడని అనేక అంశాలు ఉన్నాయన్నారు. ఒక్క శేషాచలం అడవుల్లోనే వందలాది తీర్థాలున్నాయన్నారు. ఈ తరం రచయితలు అడవుల్లో తిరిగి ప్రకృతిలోని అంశాలకు అక్షర రూపం ఇవ్వాలని కోరారు. లంకమల అడవుల గురించి పుస్తకంగా తెచ్చిన వివేక్ అభినందనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో శివ రాచర్ల, ప్రొఫెసర్ పేట శ్రీనివాసులురెడ్డి, సీపీఎం నాయకుడు కందారపు మురళి, ట్రెక్కింగ్ బాలు, రచయిత వివేక్ లంకమల సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం : ఇద్దరి అరెస్టు



అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17 : పాండిచ్చేరి నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తున్న ఇద్దరిని చిం తలచేను క్రాస్ వద్ద పోలీ సులు అరెస్టు చేశారు. వారి నుంచి 13 ఫుల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. చిం తలచేను వద్ద తనిఖీలు చే స్తుండగా తిరుపతికి చెందిన వినోద్, కుమార్‌రాజా బైక్‌పై అను మానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు దొరికినట్లు ఎస్‌ఐ స్వామినాథన్ తెలిపారు.

శ్రీవారి సేవలో జేసీ



ధ్యానచంద్ర

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ధ్యానచంద్ర ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గతం లో జేసీగా ఉన్న శుభం బన్సల్ బదిలీ కావడంతో ఆ స్థానంలో ధ్యానచంద్ర నియమితులైన విష యం తెలిసిందే. శనివారం బాధ్యతలు తీసుకున్న ఆయన ఆదివారం తిరుమలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

తిరుపతి(క్రీడలు), మార్చి 17: రెండు రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఎంజీఎం హైస్కూల్‌కు చెందిన వి.జోత్స్న (కాంస్యం), కె.నిరంజన్(వెండి) పతకాలు సాధించారు. ఆదివారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరిని జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్ అభినందించారు.

5 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తిరుపతి (కల్చరల్), మార్చి 17: కోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 5నుంచి 13వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 3వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 4న అంకురార్పణ ఉంటుందనిపేర్కొంది.ప్రతిరోజూ ప్రత్యేకపూజలు, వాహన సేవలు ఉంటాయని వెల్లడించింది. 9న గరుడ వాహనం, 12నరథోత్సవం, 13నచక్రస్నానం ఉంటాయని వివరించింది.

నిత్యావసరాల పంపిణీలో నిర్లక్ష్యం

మూలనపడుతున్న ఎండీయూ వాహనాలు



తిరుపతి క్రైం, మార్చి 17 : రేషన్‌కార్డుదారులకు ఇంటింటికీ నిత్యావసర సరుకుల పంపిణీలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇందుకోసం కేటాయించిన మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ వాహనాలు చాలావరకు మూలనపడ్డాయి. తిరుపతి జిల్లాలో 1,457 చౌక దుకాణాల ద్వారా 6,01,200కార్డుదారులకు సరుకులు పంపిణీ చేసేందుకు 369 ఎండీయూ వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటివరకు 290 వాహనాలు మాత్రమే క్షేత్ర స్థాయిలో సరుకులు పంపిణీ చేస్తున్నాయి. మిగిలిన 79 కార్యాలయాలకే పరిమితమయ్యాయి. ఈ వాహనాలు వస్తాయో రావో తెలియక కార్డుదారులు అయోమయానికి గురవుతున్నారు. ఈ క్రమంలో రేషన్ షాపుల వద్దకెళ్లి గంటల తరబడి నిలబడి సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

నాలుగు నెలలుగా అందని జీతాలు

మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ల వాహనాల నిర్వాహకులకు ప్రభుత్వం ప్రతినెలా రూ.21వేలు జీతం చెల్లిస్తోంది. వాహనాలను బ్యాంకులతో టైఅప్ చేసి లోను రూపంలో చెల్లిస్తోంది. ఇందుకోసం నిర్వాహకులు ప్రతినెలా వచ్చే రూ.21వేల జీతంలో రూ.3వేలు ఈఎంఐ చెల్లించాల్సి ఉంది. నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో బ్యాంకులో ఈఎంఐ చెల్లించలేక ఒత్తిడి పెరిగిందని వాహనాల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> **ఇబ్బందులను సరిదిద్దుతాం**
>
> ఇంటింటికీ నిత్యావసర సరుకుల పంపిణీలో కొన్ని సమస్యలున్నాయి. వివిధ కారణాలతో కొన్ని ఎండీయూ వాహనాలను వాడలేకపోతున్నాం. పరిశీలించి సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నాం. వాహనాలు లేనిచోట రేషన్ షాపుల్లో డీలర్లు అందుబాటులో ఉండి సరుకులు పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. వాహన నిర్వాహకుల జీతాల విషయం తహసీల్దార్లు చూస్తారు.
>
> - రాజా రఘువీర్, డీఎస్‌వో

ముద్రగడా.. నోరు అదుపులో పెట్టుకో

- వైసీపీలో నెల జీతానికి పనిచేసే నువ్వా పవన్ కల్యాణ్‌ని విమర్శించేది
- జనసేన తిరుపతి ఇన్‌చార్జి మండిపాటు



తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న కిరణ్‌రాయల్

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 17: 'ముద్రగడ పద్మనాభం.. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు.. వైసీపీలో నెల జీతానికి పనిచేసే నువ్వా మా అధినేత పవన్ కల్యాణ్‌ని విమర్శించేది' అంటూ జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ మండిపడ్డారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'జనసేనానికి రాజకీయ ఓనమాలు రావంటూ మాట్లాడే ముందు నీకు వచ్చుంటే.. నువ్వు, నీ కుమారుడు ఎందుకు పార్టీ పెట్టలేకపోయారు. జనసేన పార్టీ పని అయిపోయింది.. మూసేస్తారని నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. పవన్ కాపుల ద్రోహి అని మాట్లాడే ముందు నీ వెనుక ఎంతమంది కాపులున్నారో ఒకసారి చూసుకో. 2016-17లో చేపట్టిన కాపుల ఉద్యమంలో నువ్వు కాపులకు చేసిన నమ్మకం ద్రోహం అందరికీ తెలుసు. అలాంటి నువ్వు కాపులద్రోహి అంటూ మా నేతను విమర్శించడం హాస్యాస్పదంగా ఉంది. వైసీపీలో చేరేందుకు పిఠాపురం నుంచి తాడేపల్లికి వెళ్లిన నీ వెంట నీ కుమారుడు తప్ప ఎవరైనా వచ్చారా? అదేమంటే సెక్యూరిటీ ఇబ్బందులు ఉండటం వల్ల ఎవరినీ తీసుకురాలేదని సాకులు చెబుతావా? ఇక నా కుటుంబాన్ని నాశనం చేసింది చంద్రబాబు అంటూ ఈ రోజు ప్రచారం చేస్తున్నావ కదా.. మరి జగన్మోహన్‌రెడ్డి నీ కుటుంబానికి ఏం చేస్తానని హామీ ఇచ్చాడో చెప్పు చూద్దాం.. జగన్‌కి కాపలా కుక్కలా వ్యవహరిస్తున్న నువ్వా మా నేతను విమర్శించేది? ఇంకోసారి ఇలాంటి విమర్శలు చేస్తే సహించేది లేదు' అని కిరణ్‌రాయల్ హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజారెడ్డి, బాబ్జి, హరికుమార్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నామినీది గొప్ప ఊహాశక్తి

ప్రజా గాయకుడు గోరటి వెంకన్న



నామినీకి స్వర్ణ కంకణం తొడుగుతున్న గల్లా అరుణకుమారి, వేదికపై గల్లా రామచంద్రనాయుడు, గోరటి వెంకన్న తదితరులు

తిరుపతి (కల్చరల్), మార్చి 17: 'తెలంగాణ మాండలికంలో గానం చేయడానికి నామిని నాకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన ఊహాశక్తి చాలా గొప్పది' అని ప్రజా గాయకుడు, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. అమరరాజ యజమానులు ఏర్పాటు చేసిన రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కథా రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడికి మాండలిక బ్రహ్మ బిరుదును ప్రదానం చేశారు. తిరుపతి సమీపంలోని కరకంబాడిలోని అమరరాజా కర్మాగారం ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకన్న ప్రసంగించారు. ప్రముఖ పాత్రికేయుడు తాడి ప్రకాష్ మాట్లాడుతూ.. తన కథలతో కాళోజి, బాపు, పతంజలి వంటి వారి అభిమానం చూరగొన్న ధన్యజీవి నామిని అన్నారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గల్లారామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి, డాక్టర్ గౌరినేని రమాదేవిలు నామిని చేతికి స్వర్ణకంకణం తొడిగి, సన్మాన పత్రం అందజేశారు. ఈ సభకు శ్వేత సంచాలకుడు భూమన్ అధ్యక్షత వహించగా, అభినవ ప్రచురణల సంపాదకుడు సాకం నాగరాజు స్వాగతం పలికారు. ప్రజాగాయకుడు పుట్టా పెంచలదాసు, కొండారెడ్డి, జీఎస్‌కేఎస్ రాజు ప్రసంగించారు.సభలో నామిని కుటుంబ సభ్యులు, సినీ నటుడు నల్లూరి వెంకటేశ్వర్లు, అరసం తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, పేరూరు బాలసుబ్రమణ్యం, వాకా ప్రసాద్, గొర్రెపాటి రమేష్, వేమూరి జయరాం ప్రసాద్, బొందు రామచంద్రా రెడ్డి, పురంధరనాయుడు, రమేష్, ఏనుగు అంకమనాయుడు పాల్గొన్నారు. ఈ బిరుదును తన ముందు తరం మాండలిక రచయితలకు అంకితమిస్తున్నట్లు నామిని ప్రకటించారు.

దేశపురోభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనీష్‌ఆర్‌జోషి

తిరుపతి (రూరల్), మార్చి 17: దేశపురోభివృద్ధిలో యువత భాగస్వా మ్యం కావాలని యూజీసీ సెక్రటరీ ప్రొఫెసర్ మనీష్ ఆర్‌జోషి పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో ఆదివారం వికసిత భారత్-2047 ఇంట్రాక్షన్ విత్ యూత్ అండ్ మోటివేషన్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువత తమ సలహాలు, సూచనలు తెలియపరచి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని దేశవికాసం, సంస్కృతి సంరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ యువత ద్వారా దేశవికాసం జరుగుతుందని తెలిపారు. యూజీసీ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ శాలిని, రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, కంప్యూటర్ సైన్స్ హెడ్ ప్రొఫెసర్ చంద్రశేఖరం పాల్గొన్నారు.

ప్రజాగళం సభకు తిరుపతి నేతలు



తిరుపతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రజాగళం పేరిట ఎన్డీఏ కూటమి ఆదివారం నిర్వహించిన తొలి బహిరంగ సభకు తిరుపతి టీడీపీ నేతలు తరలివెళ్లారు. సభా ప్రాంగణం వద్ద ఉత్సాహంగా కేరింతలు కొడుతూ, నినాదాలు చేస్తూ హోరెత్తించారు. పార్టీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ ప్రజాగళంకు వచ్చిన స్పందన చూస్తుంటే 160 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాలు కూటమి కైవశం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడబోతున్నామని, సుపరిపాలన రానుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మహేష్ యాదవ్, కంకణాల రజినీకాంత్ నాయుడు, కృష్ణ యాదవ్, యశ్వంత్ రెడ్డి, ఎస్పీఎం శ్రీధర్, శంకర్, పవన్, శరత్, జగ్గా తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం బాధాకరం

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 17 : ఇంటిని కాజేశానంటూ అసత్య ప్రచారం చేయడం బాధాకరమని వైసీపీ నేత చైతన్య యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసపురానికి చెందిన శ్రీదేవికి, ఆమె కుమార్తె హైమావతికి కలహాలు ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో శ్రీదేవి ఇంటిని హైమావతి వేరే వ్యక్తికి విక్రయించిందని, ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలున్నాయని, అయినా పత్రికల్లో తనపై ఇలాంటి ఆరోపణలు చేయడం సమంజసం కాదని అన్నారు.



చేతులు కడిగే ప్రాంతం పాచిపట్టిన దృశ్యం - కొళాయిలో వృథాగా పోతున్న నీరు - హాస్టల్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

తిరగని ఫ్యాన్లు..కానరాని పారిశుధ్యం

- ఇదీ చెన్నారెడ్డి కాలనీ బాలికల హాస్టల్ పరిస్థితి

తిరుపతి (రవాణా), మార్చి 16: నగర పరిధిలోని చెన్నారెడ్డి కాలనీ బాలికల వసతి గృహం (ఎస్సీ-1)లో సమస్యలు కొలువై ఉన్నాయి. ఎటుచూసినా పారిశుధ్య లోపం దర్శనమిస్తోంది. ఆవరణలో చెత్త పేరుకుపోవడంతో చిన్నారులే శుభ్రం చేసుకుంటున్నారు. భోజనం చేసి, చేతులు కడిగే ప్రాంతం పాచిపట్టిపోయింది. ఏమరుపాటుగా వెళితే జారిపడక తప్పదు. కుళాయిల మరమ్మతులు పట్టించుకోకపోవడంతో నీరు వృథాగాపోతోంది. విద్యార్థినులు నిద్రించే హాల్‌లో ఫ్యాన్ తిరగడం లేదు. ఎండాకాలం కావడంతో రాత్రిపూట గాలి లేక నిద్ర కరువవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న విమర్శలున్నాయి. ఇకనైనా దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

నేటినుంచి ప్రారంభం - అరగంట ముందు కేంద్రాల్లోకి అనుమతి

తిరుపతి(విద్య),మార్చి17: టెన్త్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 162 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 30,846మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అరగంట ముందు కేంద్రాల్లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. మూడు సమస్యాత్మక కేంద్రాల(జెడ్పీహెచ్‌ఎస్ జయంపు, జెడ్పీహెచ్‌ఎస్ చిల్లమానుచేను, టీఎంఆర్ ఇంగ్లిషుమీడియం స్కూల్ కొత్తగుంట)లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే సోమవారం నుంచి జరిగే ఓపెన్ స్కూల్(టెన్త్, ఇంటర్)పరీక్షలకు జిల్లాలో 20 కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఓపెన్‌స్కూల్ టెన్త్‌లో 1,611మంది(ప్రైవేట్, రెగ్యులర్), ఇంటర్‌లో 3,235మంది(రెగ్యులర్, ప్రైవేట్) విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

విద్యార్థులకు ఉచిత ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18నుంచి 30 తేదీ వరకు ఈ సౌకర్యం ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పల్లె వెలుగు, అల్ట్రాపల్లె వెలుగు బస్సు డ్రైవర్, కండక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

నిబంధనలు ఇవే : ● పరీక్షలు ఉన్న రోజు మాత్రమే ఉచిత ప్రయాణానికి అవకాశం ● విద్యార్థుల నివాసం నుంచి పరీక్షల కేంద్రం వరకే ఉచితంగా అనుమతి ● తప్పనిసరిగా హాల్ టిక్కెట్ చూపించాలి. ● పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో మాత్రమే అనుమతి.

ఆక్రమణదారుల నుంచి నా భూమికి రక్షణ కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఓంకార్తికేయన్

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 17 : సెటిల్‌మెంట్ పట్టా ఉన్న తన భూములను ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని మంగళంకు చెందిన ఓంకార్తికేయన్ కోరారు. ఆయన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ మంగళరం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 76లో ఉన్న తన భూమిలో కొందరు ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, ఇదేమని అడిగితే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నానమ్మ నుంచి వారసత్వంగా ఆ భూమి వచ్చిందని, రికార్డులన్నీ తనవద్ద ఉన్నాయని తెలిపారు. ఈ విషయంపై గతంలో రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. స్పందనలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. అయినా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు వేశారు.. కాలువ కట్టడం మరిచారు



చెరువును తలపిస్తున్న మురుగునీరు

తిరుపతి (రవాణా), మార్చి 17 : నగర పరిధిలోని అక్కారంపల్లి వద్ద (1వ డివిజన్) ఇటీవల కాలంలో తిరుప్పావై మార్గాన్ని నూతనంగా నిర్మించారు. అయితే చుట్టుపక్కల నీరు పోవడానికి కాలువలు నిర్మించకపోవడంతో మురుగునీరు చిన్నపాటి చెరువును తలపిస్తోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే అక్కారంపల్లి, కొత్తపల్లి కాలనీలకు చెందిన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దోమల బెడద ఎక్కువైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్



ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు

ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

\- చిలకలూరిపేట






ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..




జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..



ముద్రగడా.. నోరు అదుపులో పెట్టుకో

● వైసీపీలో నెల జీతానికి పనిచేసే నువ్వా పవన్ కల్యాణ్‌ని విమర్శించేది

● జనసేన తిరుపతి ఇన్‌చార్జి మండిపాటు


మీడియాతో మాట్లాడుతున్న కిరణ్‌రాయల్

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 17: 'ముద్రగడ పద్మనాభం.. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు.. వైసీపీలో నెల జీతానికి పనిచేసే నువ్వా మా అధినేత పవన్ కల్యాణ్‌ని విమర్శించేది' అంటూ జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ మండిపడ్డారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'జనసేనానికి రాజకీయ ఓనమాలు రావంటూ మాట్లాడే ముందు నీకు వచ్చుంటే.. నువ్వు, నీ కుమారుడు ఎందుకు పార్టీ పెట్టలేకపోయారు. జనసేన పార్టీ పని అయిపోయింది.. మూసేస్తారని నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. పవన్ కాపుల ద్రోహి అని మాట్లాడే ముందు నీ వెనుక ఎంతమంది కాపులున్నారో ఒకసారి చూసుకో. 2016-17లో చేపట్టిన కాపుల ఉద్యమంలో నువ్వు కాపులకు చేసిన నమ్మకం ద్రోహం అందరికీ తెలుసు. అలాంటి నువ్వు కాపులద్రోహి అంటూ మా నేతను విమర్శించడం హాస్యాస్పదంగా ఉంది. వైసీపీలో చేరేందుకు పిఠాపురం నుంచి తాడేపల్లికి వెళ్లిన నీ వెంట నీ కుమారుడు తప్ప ఎవరైనా వచ్చారా? అదేమంటే సెక్యూరిటీ ఇబ్బందులు ఉండటం వల్ల ఎవరినీ తీసుకురాలేదని సాకులు చెబుతావా? ఇక నా కుటుంబాన్ని నాశనం చేసింది చంద్రబాబు అంటూ ఈ రోజు ప్రచారం చేస్తున్నావు కదా.. మరి జగన్మోహన్‌రెడ్డి నీ కుటుంబానికి ఏం చేస్తానని హామీ ఇచ్చాడో చెప్పు చూద్దాం.. జగన్‌కి కాపలా కుక్కలా వ్యవహరిస్తున్న నువ్వా మా నేతను విమర్శించేది? ఇంకోసారి ఇలాంటి విమర్శలు చేస్తే సహించేది లేదు' అని కిరణ్‌రాయల్ హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజారెడ్డి, బాబ్జీ, హరికుమార్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.04 కోట్లు

తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.04 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 74,351 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 34,164 మంది తలనీలాలు సమర్పించారు.

సమ్మెబాటలో గ్రామీణ బ్యాంకు కార్మికులు

నారాయణవనం, మార్చి 17: ఉమ్మడి చిత్తూరు, కృష్ణా జిల్లాలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకుల్లో దినసరి వేతనానికి పనిచేస్తున్న క్యాజువల్ కార్మికులు ఈ నెల 26వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు యూనియన్ అధ్యక్షుడు శివరాంబాబు, కార్యదర్శి రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ మెసెంజర్లుగా, అటెండర్లుగా పనిచేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని కోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. అయితే అవుట్సోర్సింగ్ ద్వారా కార్మికులను నియమించకునేందుకు బ్యాంకు యాజమాన్యం ఏజెన్సీల నుంచి టెండర్లను ఆహ్వానించిందని, దీనిని నిరసిస్తూ సమ్మె చేయననట్లు తెలిపారు. తమ సమ్మెకు కార్మిక, ఉద్యోగ సంఘాలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

బహుజన సంఘ అధ్యక్షురాలిగా హేమావతి

వడమాలపేట, మార్చి 17: డాక్టర్ అంబేడ్కర్ బహుజన సంఘం అధ్యక్షురాలుగా హేమావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అంబేడ్కర్ సేన నాయకుడు చిన్నస్వామి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మునిశేఖర్, ఉపాధ్యక్షుడుగా మాతయ్య, కార్యదర్శులుగా మంజునాథ్, ఉపకార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారులుగా వెంకటేష్, అదెయ్య, ఉపకోశాధికారులుగా చక్రవర్తి, లోకనాథం, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రాజయ్య, మునితేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

వడమాలపేట, మార్చి 17: ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించడం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టోల్ ప్లాజా వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంజేరమ్మ ఆటో యూనియన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా శివ, ఉపాధ్యక్షులుగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా శివ, సహాయ కార్యదర్శిగా నాదముని, కోశాధికారిగా రవిలను ఎన్నుకున్నారు.


ఆటో యూనియన్ ప్రారంభిస్తున్న నాయకులు

పుత్తూరు వార్తలు

తొలిసారి టెస్ట్‌ట్యూబ్‌తో కవల పిల్లల జననం



టెస్ట్‌ట్యూబ్ బేబీలతో తల్లిదండ్రులు, వైద్యులు

పుత్తూరు, మార్చి 17: పుత్తూరు సుభాషిణి ఆస్పత్రిలోని సంతానోత్పత్తి కేంద్రంలో టెస్ట్‌ట్యూబ్ ద్వారా ఆదివారం కవల పిల్లలు జన్మించారని డాక్టర్లు శ్రీధర్‌రాజు, సుభాషిణి తెలిపారు. నగరి మండలంలోని మాంగాడు గ్రామానికి చెందిన లావణ్య తమ ఆస్పత్రిలో టెస్ట్‌ట్యూబ్ విధానంలో చికిత్స తీసుకుని గర్భం దాల్చారని, ఆదివారం కాన్పు చేయగా ఒక ఆడ బిడ్డ, ఒక మగ బిడ్డకు జన్మనిచ్చారని డాక్టర్లు తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వడమాలపేట, మార్చి 17: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో తులసీరామ్ తెలిపారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గదుల్లో బల్లలు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. మండలంలోని 8 పాఠశాల నుంచి 341 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 144 మంది, బాలికల పాఠశాలలో 103 మంది పరీక్ష రాయనుండగా, పత్తి పుత్తూరు, సీతారామపురం హైస్కూల్ విద్యార్థులు రామచంద్రాపురం మండలంలోని సొరకాయలపాలెంలో, తడుకు ఆర్‌ఎస్ శ్రీబొమ్మరాజపురం హైస్కూల్ విద్యార్థులు పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లి హైస్కూల్‌లో పరీక్షలు రాస్తారని ఏంఈవో తెలిపారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

అరగంట ముందు కేంద్రాల్లోకి అనుమతి

తిరుపతి(విద్య),మార్చి17: టెన్త్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 162 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 30,846మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అరగంట ముందు కేంద్రాల్లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. మూడు సమస్యాత్మక కేంద్రాల(జెడ్పీహెచ్ఎస్ జయంపు, జెడ్పీహెచ్ఎస్ చిల్లమానుచేను, టీఎంఆర్ ఇంగ్లిషుమీడియం స్కూల్ కొత్తగుంట)లో సీసీ కెమరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే సోమవారం నుంచి జరిగే ఓపెన్ స్కూల్(టెన్త్, ఇంటర్)పరీక్షలకు జిల్లాలో 20 కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఓపెన్‌స్కూల్ టెన్త్‌లో 1,611మంది(ప్రైవేట్, రెగ్యులర్), ఇంటర్‌లో 3,235మంది(రెగ్యులర్, ప్రైవేట్) విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 17: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18నుంచి 30 తేదీ వరకు ఈ సౌకర్యం ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పల్లె వెలుగు, అల్ట్రాపల్లె వెలుగు బస్సు డ్రైవర్, కండక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

నిబంధనలు ఇవే: పరీక్షలు ఉన్న రోజు మాత్రమే ఉచిత ప్రయాణానికి అవకాశం ● విద్యార్థుల నివాసం నుంచి పరీక్షల కేంద్రం వరకే ఉచితంగా అనుమతి ● తప్పనిసరిగా హాల్ టిక్కెట్ చూపించాలి. ● పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో మాత్రమే అనుమతి.

నామినీది గొప్ప ఊహాశక్తి

ప్రజా గాయకుడు గోరటి వెంకన్న


నామినీకి స్వర్ణ కంకణం తొడుగుతున్న గల్లా అరుణకుమారి, వేదికపై గల్లా రామచంద్రనాయుడు, గోరటి వెంకన్న తదితరులు

తిరుపతి (కల్చరల్), మార్చి 17: 'తెలంగాణ మాండలికంలో గానం చేయడానికి నామిని నాకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన ఊహాశక్తి చాలా గొప్పది' అని ప్రజాగాయకుడు, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. అమరరాజ యజమానులు ఏర్పాటు చేసిన రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కథా రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడికి మాండలిక బ్రహ్మ బిరుదును ప్రదానం చేశారు. తిరుపతి సమీపంలోని కరకంబాడిలోని అమరరాజా కర్మాగారం ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకన్న ప్రసంగించారు. అలాగే ప్రముఖ పాత్రికేయుడు తాడి ప్రకాష్ మాట్లాడుతూ.. తన కథలతో కాళోజి, బాపు, పతంజలి వంటి వారి అభిమానం చూరగొన్న ధన్యజీవి నామిని అన్నారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గల్లారామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి, డాక్టర్ గౌరినేని రమాదేవిలు నామిని చేతికి స్వర్ణకంకణం తొడిగి, సన్మాన పత్రం అందజేశారు. ఈ సభకు శ్వేత సంచాలకుడు భూమన్ అధ్యక్షత వహించగా, అభినవ ప్రచురణల సంపాదకుడు సాకం నాగరాజు స్వాగతం పలికారు. ప్రజాగాయకుడు పుట్టా పెంచలదాసు, కొండారెడ్డి, జీఎస్‌కేఎస్ రాజు ప్రసంగించారు. సభలో నామిని కుటుంబ సభ్యులు, సినీ నటుడు నల్లూరి వెంకటేశ్వర్లు, అరసం తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, పేరూరు బాలసుబ్రమణ్యం, వాకా ప్రసాద్, గొర్రెపాటి రమేష్, వేమూరి జయరాం ప్రసాద్, బొందు రామచంద్రా రెడ్డి, పురంధరనాయుడు, రమేష్, ఏనుగు అంకమనాయుడు పాల్గొన్నారు. చివరగా, ఈ బిరుదును తన ముందు తరం మాండలిక రచయితలకు అంకితమిస్తున్నట్లు నామిని ప్రకటించారు.

ఎంబీయూలో ఆర్ట్ అండ్ పెయింటింగ్ కోర్సు

విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ వార్షికోత్సవంలో మంచు విష్ణు వెల్లడి




జ్యోతిప్రజ్వలన చేస్తున్న మోహన్‌బాబు, విష్ణు - చిత్రాలను మంచు విష్ణుకు అందజేస్తున్న కళాకారులు

చంద్రగిరి, మార్చి 17: భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేందుకు చిత్రకళ ఎంతో అవసరమని, అందుకోసం త్వరలోనే ఎంబీయూలో ఆర్ట్ అండ్ పెయింటింగ్ కోర్సును ప్రారంభించనున్నట్లు విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వర్సిటీ ప్రొఛాన్సలర్ మంచు విష్ణు అన్నారు. ఆదివారం ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ 11వ వార్షికోత్సవాన్ని ఎం.మోహన్‌బాబు, మంచు విష్ణు తదితరులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విష్ణు మాట్లాడుతూ చిత్రకళాకారులు గీసిన ఆర్ట్‌లను ఎంబీయూ లైబ్రరీలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఎంబీయూ చాన్సలర్ ఎం.మోహన్‌బాబు, ఆయన సతీమణి నిర్మల, మంచు విష్ణు సతీమణి విరోనిక, ఎంబీయూ ప్రిన్సిపాల్స్, డీన్లు, అధ్యాపకులు, చిత్రకళాకారులు గురజాల రమేష్(శ్రీకాళహస్తి), హైదరాబాదు నుంచి అంజనిప్రభ, కొల్లి శ్రీహర్ష, భాస్కరరావు బొత్స, లక్ష్మికిరణ్‌కుమార్, మంగ్రెరిష్ రాజధ్యాక్స్, గాయత్రి దంతూరి, వెంకన్న తీగుల్ల, సురేష్‌కృష్ణ, గోవా నుంచి స్వప్నేష్ హరిచంద్ర విఘ్నాకర్, నిషంత్‌ధ్యాన్యేర్ డాంగే, జమ్నగర్ నుంచి మనిష్‌కుమార్‌చావ్దా, బెంగళూరు నుంచి మల్లేషి, మోక్ష కుమార్, ఉదయపూర్ నుంచి లలిత్‌శర్మ, అహ్మదాబాద్ నుంచి రాకేష్ జయంతి బాయ్‌పటేల్, రోమరాకేష్ పటేల్, సోలంకి వంద్రవాన్ దామోదర్, ఢిల్లీ నుంచి రామ్ ఓంకార్ కనోజై, విమ్మి ఇంద్ర, అమిత్ కొచ్చార్, అసిత్ కుమార్ పట్నాక్, అంజుమ్‌ఖాన్, రూపేష్ ప్రకాష్ రౌత్, జగన్నాథ్ పాయిల్, పూణే నుంచి శ్రీకాంత్ లలసాహెబ్ కదం, డింకర్‌వ విష్ణు జాదవ్, ఉమాకాంత్ నివృట్టి కండే, ఇండోర్ నుంచి వచ్చిన గౌరి వేముల, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు



కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

బీఎస్ఎఫ్‌తో కలిసి పోలీసుల ఫ్లాగ్ మార్చ్

రేణిగుంట, మార్చి 17: ఎన్నికల నేపథ్యంలో రేణిగుంట పట్టణంలో బీఎస్ఎఫ్‌తో కలిసి రేణిగుంట పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని పురవీధుల్లో జిల్లా ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ భవ్యశ్రీ నేతృత్వంలో కేంద్ర బలగాతో కలిసి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు సుబ్బారెడ్డి, మల్లికార్జున్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీ విక్రేత మృతి

శ్రీకాళహస్తి, మార్చి 17: సైకిల్ పై టీ అమ్ముకుంటూ జీవనం సాగించే పార్థసారథి అనే వ్యక్తి మృతి చెందాడు. శ్రీకాళహస్తి ఒకటవ పట్టణ సీఐ నరసింహారావు కథనం మేరకు...తొట్టంబేడు మండలం కనపర్తి గ్రామానికి చెందిన పార్థసారథి కుటుంబం శ్రీకాళహస్తి పట్టణ శివారులోని తుఫాన్ సెంటర్ వద్ద ఇల్లు కట్టుకొని స్థిరపడ్డారు. శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలో సైకిల్ పై రాత్రిపూట టీ విక్రయిస్తూ పార్థసారథి జీవనం సాగిస్తున్నాడు. పూర్తిగా మద్యానికి బానిసై భార్యా, పిల్లలు, తల్లిదండ్రులతో తరచు గొడవపడేవాడు. అతని వేధింపులు తాళలేక అందరూ వేరుగా నివాసం ఉండటంతో పార్థసారథి తుఫాన్ సెంటర్ వద్ద ఇంట్లో ఒంటరిగా గడిపేవాడు. కాగా ఆ ఇంటి పక్కనే అతడి మృతదేహం పడి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అధికంగా మద్యం సేవించి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు భావించి కేసు నమోదుకు నిరాకరించారు. ఎంతో పోలీసులు శవాన్ని బంధువులకు అప్పగించారు.

పొత్తు ధర్మం పాటించండి: జనసేన

శ్రీకాళహస్తి, మార్చి 17: పొత్తు ధర్మం పాటించాలని జనసేన నియోజకవర్గ ఇంచార్జి వినుత టీడీపీ శ్రేణులను కోరారు. ఆదివారం పట్టణంలోని ఆమె ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినుత మాట్లాడుతూ.. తన ఇంటి ముందు టపాసులు కాల్చిన వారితో టీడీపీకి సంబంధం లేకపోతే ఆ విషయాన్ని ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని చెప్పారు. జనసేన నాయకులు చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకుండా రోడ్డు ఏర్పాటు

ఏర్పేడు, మార్చి 17: మండలంలోని వికృతమాల వద్ద రేణిగుంట మండలం వెదళ్లచెరువు గ్రామ రెవెన్యూకు సంబంధించిన భూమిని కొందరు రైతుల వద్ద మూడేళ్ల క్రితం ఏపీఐఐసీ తీసుకుంది. అయితే నేటికీ రైతులకు పరిహారం ఇవ్వలేదు. కానీ ఆ భూమిలో ఆదివారం ఏపీఐఐసీ అధికారులు రోడు ఏర్పాటు చేశారు. పరిహారం ఇవ్వకుండా రోడ్డెలా వేస్తారని రైతులు ప్రశ్నించడంతో తాత్కాలికంగా రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేశారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



పట్టుబడ్డ మద్యం బాటిళ్లు

పిచ్చాటూరు, మార్చి 17: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం రాత్రి ఎస్ఐ వెంకటేశ్వర్లు తన బృందంతో కలసి అరెస్టు చేశారు. వీరి నుంచి 500 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా... సాధారణ తనిఖీలో భాగంగా పిచ్చాటూరు బైపాస్ రోడ్డుపై తనిఖీ చేస్తున్న పోలీసులకు పుత్తూరు నుంచి విజయపురం మండలంలోని మంగళగిరి కండ్రిగకు వెళ్తున్న ఆటోను ఆపారు. అట్టపెట్టెలో ప్యాక్ చేసిన మద్యం బాటిళ్లను పుత్తూరుకు చెందిన జగదీష్, వేలు తరలిస్తుండడంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లారీ ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

ఏర్పేడు, మార్చి 17: స్కూటర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో స్కూటరిస్టు గాయపడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఏర్పేడు ఎస్ఐ జిలానీ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోబాక గ్రామానికి చెందిన సుధాకర్ నాయుడు(42) ద్విచక్ర వాహనంపై తన సొంతపనుల నిమిత్తం ఏర్పేడుకు వచ్చాడు. ఆదివారం రాత్రి 9గంటల ప్రాంతంలో పనులు ముగించుకుని కోబాకకు వెళుతుండగా ఆరులేన్ల రోడ్డు నిర్మాణ పనుల కంపెనీకి చెందిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధాకర్‌నాయుడు గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

రెండు కుటుంబాల మధ్య వివాదం

ఏడుగురిపై కేసు నమోదు

ఏర్పేడు, మార్చి 17: మండలంలోని మర్రిమంద గ్రామానికి చెందిన బత్తెయ్య, బాలకృష్ణ కుటుంబాల మధ్య కొంతకాలంగా వివాదం ఉంది. ఈ క్రమంలో ఈ రెండు కుటుంబాల మధ్య ఆదివారం రాత్రి 9.30గంటల సమయంలో వివాదం గట్టిగా జరిగింది. దీంతో బత్తెయ్య ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో బాలకృష్ణతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఆరుగురు మొత్తం ఏడుగురిపై ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిపాయి భరోసా అందజేత

తొట్టంబేడు, మార్చి 17: శ్రీకాళహస్తి మండలంలోని వేడాం గ్రామంలో నివాసం ఉంటున్న మన్నసముద్రం చంగారెడ్డి, శ్రీకాళహస్తి పట్టణం పానగల్‌కి చెందిన నటరాజన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం సిపాయి భరోసా కింద 40రకాల నిత్యావసర వస్తువులను వారిరువురి కుటుంబాలకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో రత్నంరెడ్డి, బాలాజీరెడ్డి, మురళికృష్ణారెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

చెరకుసాగుపై ఆసక్తి చూపని రైతులు

● ప్రత్యామ్నాయ పంటల వైపు ఆసక్తి



అరిగిల కండ్రిగలో చెరకు గడలు కోస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 17: మండలంలో ప్రధాన పంటలతో పాటుగా చెరకు సాగు చేసే రైతులు ప్రస్తుతం చెరకు పంట తక్కువగా వేస్తున్నారు. మండలంలో మయూర షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటు తరువాత రైతులు అధికంగా చెరకు సాగు చేశారు. ఫ్యాక్టరీ మూసివేయడంతో 1800 ఎకరాల్లో జరిగే చెరకు సాగు నేడు కాటూరు, అరిగిలకండ్రిగ, వీఎస్‌పురం గ్రామాల కేవలం వంద ఎకరాలకే పరిమితం కావడం విశేషం. ఈ చెరకును కూడా పల్లిపట్టు ఫ్యాక్టరీకు తరలిస్తున్నారు. . మండలంలో వరితో పాటుగా ప్రధాన పంటగా సాగువుతున్న చెరకు పంట కనమరుగైవుతుండంపై పలువరు రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నేతల ఆందోళన

సత్యవేడు, మార్చి 17: సత్యవేడు టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే ఆదిమూలం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ నాగలాపురంలో ఆదివారం ఆందోళన చేశారు. ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి ఎండీ కుమార్, తెలుగు యువత నాయకుడు తిరుపతి ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మణి, సతీష్, పాండియన్, సురేష్, కూపేష్ కుమార్, సౌందరరాజ్, దీన, రాధిక, ఏకవళ్ళి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: సత్యవేడు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి ఆదివారం స్థానిక సాయి బాబా గుడి వద్ద రోడ్డుపై కార్యకర్తలు భూత్ ఇంచార్జీలతో కలిసి బైఠాయించారు. కనీసం టీడీపీ సభ్యత్వం లేని ఆదిమూలంకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం దారుణమన్నారు.

నేటినుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం



ఎంజేపీబీలో పరీక్షల కోసం ఏర్పాటు చేసిన డెస్కులు

సత్యవేడు, మార్చి 17: టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సత్యవేడులో 3 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రవి పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు గాను 32 ఇన్విజిలేటర్లు నియమించారు. పరీక్షల ప్రధాన అధికారులుగా విమల, మారయ్య, మునిసుబ్రహ్మణ్యం, డిపార్ట్‌మెంట్ అధికారులుగా హరినాథ్, రమేష్ బాబు, వైవీఎల్ కుమార్ వ్యవహరించనున్నారు. పరీక్షలు రాయడానికి అనువుగా విద్యార్థులకు అవసరమైన బల్లలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. పరీక్ష సమయానికి 45 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలన్నారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వీరాంజనేయులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

కేవీబీపురం: మండలంలో సోమవారం నుంచి ప్రారంభమవుతున్న టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ లక్ష్మీపతి, రవి చెప్పారు. మండలంలో మొత్తం మూడు కేంద్రాలల్లో 521 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నట్లు తెలిపారు.

కోడ్ ఎఫెక్ట్..

తొలగిస్తున్న కటౌట్లు, ఫ్లెక్సీలు

సత్యవేడు, మార్చి 17: రాష్ట్రంలో ఎన్నికల నగారతో అధికారులు అప్రమత్తమయ్యారు. కోడ్ ఎఫెక్ట్ కారణంగా మండలంలో రాజకీయ పార్టీల బ్యానర్‌లు, ఫ్లెక్సీలు ఒక్కొక్కటిగా తొలుగుతున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. పట్టణంలోని నేతాజీ రోడ్డులోఓ భవనంపై ఉన్న అధికార పార్టీకి చెందిన హోర్డింగ్‌ను ఆదివారం సాయంత్రం సిబ్బంది తొలగించేశారు.

ఏర్పేడు: మండలంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు వేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను అధికారులు ఎన్నికల కోడ్ మేరకు ఆదివారం తొలగించారు. పంచాయతీ కార్మికుల సాయంతో కటౌట్లు, బ్యానర్లను తొలగించారు. అదే విధంగా పలు గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫొటోలతో వేసిన బ్యానర్లు, కటౌట్లు ఉంటే వెంటనే తొలగించాలని ఎంపీడీవో గిడ్డయ్య రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలకు తెలిపారు. ఎండీపుత్తూరు, పాపాఆనాయుడుపేట తదితర గ్రామాల్లో రాజకీయ బ్యానర్లు పూర్తిగా తొలగించాలని ఆయన సూచించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి, గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సిలను తహసీల్దార్ మహ్మమద్ ఆలీఖాన్ ఆదేశాలతో ఆదివారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు బ్యానర్లు, ఫ్లెక్సిలు పెట్టకూడదన్నారు. ఎన్నికల కోడ్ ఎవ్వరైన అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రాజీవ్‌నగర్‌లో ఆగని భూకబ్జాలు

శ్రీకాళహస్తి, మార్చి 17: పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో భూ కబ్జాదారుల ఆగడాలకు అంతేలేదు. తాజాగా ఆదివారం కొన్ని ఖాళీ ఇళ్ల స్థలాలను కబ్జా చేసేందుకు ఆక్రమణదారులు ప్రయత్నించారు. రాజీవ్‌నగర్ లోని ఎన్టీఆర్ గృహాల సమీపంలో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలపై కన్నేశారు. వేకువ జామున ఖాళీ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేసేందుకు యంత్రాలతో గుంతలు తీశారు. స్థానికులు అడ్డుకోవడంతో కబ్జాదారులు పనులను నిలిపివేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి భూకబ్జాలను కట్టడి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రాజీవ్‌నగర్‌లో అక్రమార్కులు తవ్వకాలు చేసిన ఇళ్ల స్థలాలు

ప్రజాగళానికి తరలివెళ్లిన పసుపుదండు

శ్రీకాళహస్తి/ఏర్పేడు/కేవీబీపురం/పిచ్చాటూరు: మార్చి 17: ప్రజాగళం బహిరంగ సభకు శ్రీకాళహస్తి నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన బహిరంగ సభకు ఉదయం శ్రీకాళహస్తి నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ పాలసరఫరా సంఘం చైర్మన్ మునిరాజా నాయుడు, నాయకులు గోపీనాథ్, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు మండలం నుంచి ప్రజాగళం సభకు వెళ్లినవారిలో గురవారెడ్డి, పొన్నారావు, శివశంకర్‌రెడ్డి, మునెయ్య, కృష్ణవేణి, రవి, నిరంజన్, దొరస్వామిరెడ్డి, మునిరామిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, భాస్కర్‌నాయుడు, మునీంద్రయాదవ్ తదితరులు ఉన్నారు.

పిచ్చాటూరు నుంచి టీడీపీనాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు.

కేవీబీపురం మండలం నుంచి ప్రజాగళం సభకు నాయకులు సర్పంచులు తరలి వెళ్ళారు. సురేష్ రెడ్డి, సుబ్రమణ్యం, చంద్రయ్య నాయుడు, సర్పంచ్ బాలజి, నాగరాజ రెడ్డి, దశరథయ్య నాయుడు, అయ్యప్ప, రామరావు, వెంకటేష్, కిరణ్ బాబు, మనోహర్, గోపి, శేఖర్, దాము, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

అంగరంగ వైభవంగా చక్రస్నానం



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

తొట్టంబేడు, మార్చి 17: ప్రసన్నవెంకటేశ్వరస్వామికి ఆదివారం చక్రస్నానం నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా ఉదయం ఆలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చక్రస్నానం నిర్వహించిన ఆలయ అర్చకులు, రాత్రి స్వామివారి ధ్వజావరోహణం జరిపారు.



ధ్వజావరోహణం చేస్తున్న దృశ్యం

సాంస్కృతిక కార్యక్రమాల అవినీతిపై విచారణ చెయ్యాలి



జనమాల గురవయ్య

శ్రీకాళహస్తి, మార్చి 17: ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల అవినీతిపై విచారణ చేయాలని సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య డిమాండ్ చేశారు. ధూర్జటి కళా ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అవినీతి ఆరోపణల పై ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'పాపం కళాకారులు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య స్పందించారు. తాను దశాబ్ద కాలంగా ముక్కంటి ఆలయంలో కళాకారులకు జరుగుతున్న అన్యాయంపై పోరాడుతున్నానన్నారు. ఆలయానికి పెద్ద అధికార యంత్రాంగం ఉండగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రైవేట్ వ్యక్తికి ఎందుకు అప్పగిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇకనైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి సాంస్కృతిక కార్యక్రమాల్లో అవినీతిపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు



పార్టీలో చేరిన వారితో సుధీర్ రెడ్డి

తొట్టంబేడు, మార్చి 17: మండలంలోని చిట్టత్తూరు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు భీమావేణురెడ్డి, భానుచంద్రారెడ్డి , మాసిరెడ్డి బుచ్చిరెడ్డి ఆదివారం టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలోని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహానికి వెళ్లిన వారికి సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాజనాయుడు, బాలాజీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిచ్చు రేపిన వివాహ నిశ్చయం

● తండ్రీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, మార్చి 17: వివాహ నిశ్చయం ఓ కుటుంబంలో చిచ్చు రేపింది. తండ్రి, కూతురు మధ్య మాటా మాటా పెరిగి ఇద్దరి ఆత్మహత్యాయత్నానికి దారితీసింది. ఈ ఘటన తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. రామచంద్రపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేవిబిపురం మండలం పెరిందేశం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. రెండు నెలల ఇరు కుటుంబాల పెద్దలు ఆటోడ్రైవర్, కలంకారీ యువతికి వివాహ నిశ్చయం చేసుకున్నారు. పది రోజుల్లో వివాహం ఉండడంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఇంతలో పెళ్లి కుమార్తె తనకు వివాహం ఇష్టం లేదంటూ కుటుంబ సభ్యులకు తెలిపింది. బంధువులందరికీ శుభలేఖలు కూడా పంచేసామని... ఈ సమయంలో పెళ్లి ఆగితే పరువు పోతుందని తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. వివాహ నిశ్చయం రద్దు విషయమై మూడు రోజులుగా తండ్రీ కూతుర్ల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఆదివారం వివాహ ప్రస్తావనతో మళ్లీ ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. దాంతో కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తాను కూడా చనిపోతానంటూ వెంటనే తండ్రి అదే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఇద్దరిని శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శ్రీకాళహస్తిలో పట్టణ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

శ్రీకాళహస్తి, మార్చి 17: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రేణిగుంట మండల కార్యదర్శి మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే వర్కర్స్, స్వీపర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు మోహన్ రెడ్డి మాట్లాడుతూ... స్వీపర్లు,మధ్యాహ్న భోజన కార్మికులు, వాచ్‌మెన్‌ల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి నెలా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సుశీల, ద్రాక్షాయని, మాధవి, దనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్ రెడ్డి

శ్రీవారి సేవలో జేసీ



ధ్యానచంద్ర

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ధ్యానచంద్ర ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గతంలో జేసీగా ఉన్న శుభం బన్సల్ బదిలీ కావడంతో ఆ స్థానంలో ధ్యానచంద్ర నియమితులైన విషయం తెలిసిందే. శనివారం బాధ్యతలు తీసుకున్న ఆయన ఆదివారం తిరుమలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

5 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తిరుపతి (కల్చరల్), మార్చి 17: కోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 5నుంచి 13వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 3వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 4న అంకురార్పణ ఉంటుందని పేర్కొంది. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, వాహన సేవలు ఉంటాయని వెల్లడించింది. 9న గరుడ వాహనం, 12న రథోత్సవం, 13న చక్రస్నానం ఉంటాయని వివరించింది.

బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

తిరుపతి(క్రీడలు), మార్చి 17: రెండు రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఎంజీఎం హైస్కూల్‌కు చెందిన వి.జ్యోత్స్న (కాంస్యం), కె.నిరంజన్(వెండి) పతకాలు సాధించారు. ఆదివారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో వీరిని జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్, కార్యదర్శి ఆర్.శ్రీధర్ తదితరులు అభినందించారు.

ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 17 : ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. కోడ్ అమలుపై ఆయన ఆదివారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో కూడిన పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లను తక్షణమే తొలగించాలని సీఈవో ఆదేశించారు. 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో, 48 గంటల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లో, అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాలన్నారు. సి-విజిల్‌లో అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్సులో సీఈవో ముఖేష్‌కుమార్ మీన